

సచివాలయాల్లో రైస్ కార్డ్‌లో మార్పులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రైస్ కార్డులలో మార్పులు, చేర్పులను గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ దిగువ పేర్కొన్న వాటికి సంబంధించిన సేవలు పొందవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రైస్ కార్డులకు సంబంధించి కొత్త బియ్యం కార్డు పొందేందుకు, బియ్యం కార్డు విభజన, సాధారణ విభజన, వితంతువు విభజన, విడాకుల విభజన (పిల్లలతో), సింగిల్ మెంబర్ స్ప్లిట్, వివాహ విభజన, బియ్యం కార్డులో కొత్తగా సభ్యుల చేరిక (పుట్టుక కారణంగా లేదా వివాహం కారణంగా), బియ్యం కార్డులో సభ్యుల తొలగింపు (మరణ సందర్భాలలో మాత్రమే), బియ్యం కార్డులో చిరునామా మార్పు, బియ్యం కార్డు సరెండర్ వంటి సేవలను సమీపంలోని గ్రామ వార్డు సచివాలయంలో పొందవచ్చని పేర్కొన్నారు.

గోదావరి ఈత.. కడుపు కోత..

- కన్నవారి గుండెల్లో బడబాగ్ని
- అధికార యంత్రాంగం నిర్లక్ష్యం
- అక్రమ ఇసుక తవ్వకాలూ కారణమే

గోదావరిలో పిల్లల ఈత సరదా కన్నవారి గుండెల్లో గాయాలు రేపుతోంది. స్నేహితులంతా గోదావరి తీరానికి వచ్చాక స్నానానికి దిగారు. ఒకరు కొట్టుకుపోతుంటే మరో ముగ్గురు కాపాడడానికి వెళ్లారు. వాళ్లూ కొట్టుకుపోతుంటే మరో ఇద్దరు దిగారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు ఎనిమిది మంది మునిగిపోయారు. ముమ్మిడివరంలో ఈ విషాదం మురువకముందే పి.గన్నవరం మండలం రావిలంకలో గోదావరిలో ఈతకు దిగి మంగళవారం మరో ముగ్గురు గల్లంతయ్యారు.

ప్రజాశక్తి - అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం

అమ్మానాన్నలకు ఊరెళ్తామని చెప్పి వెళ్లి ఆ పిల్లలు ఇళ్లకు తిరిగి రాలేదు. వారు గోదాట్లోకి స్నానానికి దిగి గల్లంతయ్యారన్న సమాచారం మాత్రం చేరింది. సమాచారం తెలిసి కొందరు అచేతనంగా అక్కడే కూలబడిపోతే ఇంకొందరు కన్నా ఎక్కడున్నావురా అంటూ గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం శేరిలంకలో స్నేహితుడి ఇంట వేడుకకు కాకినాడ, మండపేట, రామచంద్రపురం తదితర ప్రాంతాల నుంచి వెళ్లిన 11 మంది మిత్ర బృందం భోజనాలయ్యాక గోదావ తీరానికి వెళ్లారు. వీరిలో ఒకరు గోదావరిలో మునిగిపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించి మరో ఏడుగురు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయారు. సలాదివారిపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న గోదావరి నది తీవ్ర కోతకు గురికావడంతో ఒడ్డునే లోతుగా ఉంటుందని స్థానికులు తెలిపారు. స్నానాలకు దిగిన పిల్లలు ఇతర ప్రాంతాలకు చెందినవారు కావడంతో గోదావరి స్థితి తెలియక ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారని చెబుతున్నారు. సంఘటనపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణం స్పందించింది. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్‌పి కృష్ణారావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎన్డీఆర్‌ఎఫ్ బందాలను రంగంలో దింపి గాలింపు చర్యలు చేపట్టారు. తీరం వద్ద విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు.

ముమ్మిడిరం మండలంలో కమిని పంచాయతీ సలాదివారి పాలెం గోదావరి రేవులో సోమవారం 11 మంది యువకులు స్నానాలకు దిగి 8 మంది గల్లంతు కావడం విదితమే. ఈ గల్లంతైన వారి కోసం విస్తతంగా గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం సాయంత్రం నాటికి ఏడుగురి యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలిన ఒకరి మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. లభ్యమైన మృతదేహాలను ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి శవ పంచనామా పూర్తి చేసి బంధువులకు అందజేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

గోదావరి నదిలో మతి చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, మతి చెందిన ప్రతిఒక్కరికీ రూ.కోటి పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని సిపిఎం బృందం సందర్శించింది. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి నదిలో నుండి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల అక్కడక్కడా భారీ గుంతలు ఏర్పడుతున్నాయని, అలాంటి చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవటం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలు మీడియాలో వస్తున్నా, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నా ఉన్నతాధికారుల యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దానివల్లే ఈరోజు 8 మంది ప్రాణాలు బలి తీసుకున్నాయని. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరామ్ తదితరులు ఉన్నారు.

ముమ్మిడివరం మండలం కమిని వద్ద విద్యార్థులు దుర్మరణం చెందడం ఎంతో విచారకరమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సురేంద్ర, ఎంటిబిఎస్ సుబ్బారావు సంతాపం తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాల్లో ఇటీవల చాలామంది విద్యార్థులు గల్లంతవుతున్నారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా తగు జాగ్రత్తలు తీసుకుని తమ బిడ్డలు ఇటువంటి ప్రమాదాలు బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు.



ముమ్మిడివరంలో గాలింపు ప్రదేశంలో కన్నీరు మున్నీరవుతున్న మృతుల కుటుంబాలు



పి.గన్నవరంలో గల్లంతైన విద్యార్థుల దుస్తులు, చెప్పులు

గోదావరి స్నానానికి వెళ్లి ముగ్గురు గల్లంతు

ప్రజాశక్తి-పి.గన్నవరం

గోదావరిలో ఎనిమిది మంది గల్లంతైన ఘటనలో ఒక పక్క గాలింపు సాగుతుండగానే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మరో విషాదం చోటు చేసుకుంది. పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధిలో రావిలంక సమీపంలో గోదావరిలో స్నానం చేస్తూ ముగ్గురు యువకులు గల్లంతైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఐదుగురు యువకులు గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ముగ్గురు గోదావరిలో మునిగి పోయినట్లు వారి బట్టలు, సెల్ ఫోన్లు గోదారి ఒడ్డున గుర్తించారు. ఈ విషయమై స్థానికులు తహశీల్దారు పి.శ్రీపల్లవి, ఎస్ఐ బి.శివకృష్ణకు సమాచారం ఇవ్వగా గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారిలో నాగుల్లంకకి చెందిన సానబోయిన సూర్య తేజ (12), నీతిపూడి పాల్ కుమార్ (15), కేతా ప్రవీణ్ (15)గా గుర్తించినట్లు తెలుస్తుంది. అధికారులు వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సంఘటన స్థలానికి బయలుదేరి వెళ్లారు.



అయోధ్యలంక ఘటనా ప్రదేశంలో ఎంఎల్ఎ సత్యనారాయణ

పిహెచ్‌సిలో మంత్రి దుర్గేష్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తాడిమళ్ల పిహెచ్‌సిని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులు, సిబ్బంది హాజరు వివరాలు ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. మందుల నిల్వలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెడికల్ ల్యాబ్‌కు తాళం వేసి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ల్యాబ్ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి తెరిచి ఉన్న సమయంలో రక్త పరీక్ష గదికి తాళం వేసి ఉండటమేంటని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో అందుతున్న సేవలపై స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. తమను పట్టించుకోవట్లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేయడంతో మంత్రి దుర్గేష్ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పునరావృతమైతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆరోగ్య సిబ్బంది నిర్ణీత సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నా విషయాన్ని మరవకూడదన్నారు. ప్రజా ఆరోగ్య సంక్షేమమే పరమావధిగా పని చేయాలన్నారు.



పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న మంత్రి దుర్గేష్

కందుకూరి స్ఫూర్తితో విద్యారంగ అభివృద్ధి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

బాలాజీ దాస్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటిపూడి స్కూల్లో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో నవ యుగ వైతాళికుడు శ్రీ కందుకూరి వీరేశలింగం 107వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. కంటిపూడి స్కూల్ హెచ్‌ఎం పి.దుర్గా ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బి.పవన్ వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్య కోసం కృషి చేసిన వ్యక్తి, గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. మొట్ట మొదటి వితంతు పునర్వివాహం జరిపారని, ఆ కాలంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారని, అనేక అసమానతలు రూపు మాపేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు. తొలి మహిళా పాఠశాలను ఏర్పాటు చేసి స్త్రీ విద్యకు బాటలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రావు, మోహన్ ప్రకాష్, నాయకులు జ్యోతి, సౌమ్య, జోసెఫ్, సిఐటియు జిల్లా కార్యదర్శి పూర్ణిమ రాజు , విద్యార్థులు పాల్గొన్నారు.



కందుకూరికి ఘన నివాళి అర్పిస్తున్న నాయకులు

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మ రక్షణ

ప్రజాశక్తి-కడియం


మార్షల్ ఆర్ట్స్ వంటి యుద్ధ విన్యాసాల్లో నైపుణ్యం కలిగి ఉండటం ఆత్మ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని మండలంలోని కడియపులంక గ్రామ సర్పంచ్ పాఠంశెట్టి రామ్‌జీ అన్నారు. సీనియర్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ గండ్రోతు నాగప్రదీప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చిన్నారులకు ఏర్పాటు చేసిన ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ రామ్‌జీ మంగళవారం పరిశీలించారు. అరకొర సాధనాలతో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్న విద్యార్థులకు సుమారు రూ.15 వేల సొంత నిధులతో సమకూర్చిన కరాటే కిట్లను సర్పంచ్ రామ్‌జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పంతం గణపతి, గ్రామ వార్డు సభ్యులు కట్టా శివ, మార్షల్ ఆర్ట్స్ సీనియర్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, గండ్రోతు భాస్కర్ రావు, మహిళా కోచ్ కె.శ్రీకావ్య పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు పడాలి

ప్రజాశక్తి- నిడదవోలు రూరల్

గ్రామాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగు పడాలని ఎంపిడిఒ డి.లక్ష్మీనారాయణ అన్నారు. సమిశ్రగూడెం గ్రామ పంచాయితీలో కొద్దిరోజులుగా గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో ట్రాక్టర్ సాయంతో అండర్ గ్రౌండ్‌లో సిల్ట్, చెత్త, మురికిని పూర్తిగా తొలగిస్తున్నారు. మంగళవారం అరుంధతి పేటలో సిల్ట్ తొలగింపు పని చేపట్టారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలో మురికినీరు నిల్వ ఉండకుండా ఉపయోగపడుతుందని ఎంపిడిఒ తెలిపారు. సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినందుకు కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

కార్టూన్ 'నిజం'



కేంద్ర కారాగారంలో యోగాంధ్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం కేంద్రకారాగరంలో యోగాంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్‌సి సోము వీర్రాజు, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి జి.చిన్న రాముడు, జైలు పర్యవేక్షణాధికారి రాహుల్ అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో గిన్నిస్ రికార్డు గ్రహీత కెఎల్‌వి.శ్రీధర్ రెడ్డి యోగాసనాలు అభ్యసనం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ నేపథ్యంలో నెలరోజులపాటు యోగా ఆవశ్యకతను వివరిస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా యోగాభ్యాసన చేస్తున్నారని, వారి మార్గదర్శకత్వంలో యోగాంధ్ర కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. జూన్ 15న తిరుపతిలో సినిమా రంగ ప్రముఖులతో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో 1,23,000 మందితో యోగా సాధన చేసి నెలకొల్పిన రికార్డును అధిగమించాలన్న సంకల్పంతో విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో యోగా దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇది రికార్డుల కోసం చేపట్టిన కార్యక్రమం కాదని, మానసిక శారీరక ఆరోగ్యానికి యోగ దోహదపడుతుందనే సందేశం ప్రతి ఒక్కరికి చేర్చి, వారు యోగ సాధన చేసేలా ప్రోత్సహించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ .. యోగ సాధన ఒక రోజుతో పూర్తి కాదని ఇది నిరంతర ప్రక్రియని, ప్రతి ఒక్కరూ యోగ ప్రయోజనాలు పొందాలి అనే ఉద్దేశ్యంతో నెల రోజులపాటు యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి రమేష్ బాబు, డిఆర్ఒ టి.సీతారామ్మూర్తి, సెంట్రల్ జైలు అధికారులు బి.రత్నరాజు, ఆర్.శ్రీనివాసులు, జిల్లా ఆయుష్ వైద్యులు, కె.రమేష్, రాష్ట్రపతి అవార్డ్ పురస్కార గ్రహీత, సెంట్రల్ జైలు ఉపాధ్యాయులు కె.శ్రీనివాస రావు, యోగాంధ్ర జిల్లా సమన్వయకర్త పి.కెజియ తదితరులు పాల్గొన్నారు.



యోగాంధ్రలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ప్రజాప్రతినిధులు

ఎస్ఎస్‌సి ప్రతిభా పురస్కారాల అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం మైత్రేయ బుద్ధ విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎస్‌సి 2025 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఉండ్రాజవరం జడ్‌పి హెచ్ పాఠశాల విద్యార్థిని కరెళ్ల నవ్యశ్రీ, 560 మార్కులతో ద్వితీయ స్థానం సత్యవాడ విద్యార్థిని కత్తుల కుసుమ, 558 మార్కులతో తృతీయ స్థానం సాధించిన సత్యవాడ విద్యార్థి కల్వకుంట్ల సూర్య తేజ, సూర్యారావుపాలెం, మోర్త, తాడిపర్రు, వేలివెన్ను, చివటం పాఠశాలల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు మెమెంటోలతో సత్కరించారు. వీరితోపాటు మండల స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ఉత్తీర్ణతా శాతం సాధించి, ప్రథమ స్థానం పొందిన జడ్‌పి హైస్కూల్ సూర్యారావుపాలెం హెచ్‌ఎం జి.పౌల్ ప్రకాశం, ద్వితీయ స్థానం జడ్‌పి హైస్కూల్ చివటం హెచ్‌ఎం, ఇ.ఏడుకొండలు, తృతీయ స్థానం పొందిన కెఎల్.గణేష్‌లను యుటిఎఫ్ మెమెంటోలతో సత్కరించారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు యాళ్లబండి స్వామి, జిల్లా సహాధ్యక్షులు యివ్వల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి రామారావు, గౌరవ అధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.తాతారెడ్డి, అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, కుంకట్ల వెంకటరత్నం పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని పలు సినిమి థియేటర్లను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక సాయికృష్ణ (అనుశ్రీ సినిమాస్), రంభ, ఊర్వశి, మేనక, సూర్య పాలస్, సూర్య మినీ థియేటర్‌లలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డిఎస్‌పి భవ్యకిషోర్, డిపిఆర్ఒ వై.బాలకృష్ణ, జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్కయ్య, అర్బన్ తహశీల్దార్ సిహెచ్.పాపారావు తదితరులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థియేటర్ లైసెన్స్, ఫైర్ లైసెన్స్, స్మోక్ డిటెక్షన్, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, సినిమా టికెట్లు, పానీయాల ధరలు, తాగునీటి సదుపాయం వంటి వాటిని పరిశీలించినట్టు చెప్పారు. లోపాలు ఉన్న థియేటర్ యజమాన్యాలకు నోటీసులు జారీ చేయనున్నట్టు ఆహార, పానీయాల ధరలపై నియంత్రణ ఉండాలని, టికెట్ల ధర పెంపుపై ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే అనుమతులు ఇస్తామని తెలిపారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎండియు వాహనాలను కొనసాగించి రేషన్‌ను ఇంటింటికీ అందజేయాలని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన.వేణుగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఎండియు ఆపరేటర్లు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రతినెలా సక్రమంగా ఇంటింటికీ రేషన్ అందజేస్తున్న ఎండియు ఆపరేటర్ల వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైసిపి ప్రభుత్వంలో బ్యాంకుల నుంచి రుణాలు పొంది వాహనాలు తీసుకుని ప్రతినెలా ఇఎంఐలు చెల్లిస్తూ ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్న ఎండియు వ్యవస్థను అర్ధాంతరంగా తొలగించడం ప్రభుత్వానికి తగదన్నారు. దాదాపు 10 వేలమంది కార్మికులు వీధిన పడాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

వేసవి శిబిరాలతో విజ్ఞానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాఠశాలలో చదువుకునే చిన్నారులకు ఆటవిడుపుగా వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపకరిస్తాయని విశ్రాంత ఉద్యోగి, శిబిర స్వచ్ఛంద నిర్వాహకులు మద్దిపాటి రామచంద్రరావు తెలిపారు. గత 25 రోజులుగా నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన శిబిరంలో ఇంగ్లీషు, హిందీ, పురాణాలు, లెక్కలు, కథలు, యోగ వంటి పలు విషయాలపై వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా సుమారు 20 మంది విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాలకు హాజరవుతున్నారన్నారు. వారిని ప్రోత్సహించేందుకు, వివిధ రకాల పోటీలు ఏర్పాటు చేసి, వారిలో పోటీతత్వాన్ని పెంచి, ఏరోజు కారోజు పెన్నులు, పెన్సిళ్ల వంటి చిన్న చిన్న బహుమతులను సైతం సొంత సొమ్ము వెచ్చించి, బహూకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి సూర్య ప్రసాద్, ముద్దుల కృష్ణారావు, లైబ్రేరియన్ జి.కృష్ణారావు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయి, ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలికి పలువురు గ్రామస్తులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని చివటం గ్రామానికి చెందిన నీలం తులసమ్మ నివాసముంటున్న ఇంటికి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయింది. నిలువ నీడ లేకపోవడంతో ఆమె తన కుమార్తె ఇంటిలో తల దాచుకుంటోంది. దీంతో హైదరాబాదుకు చెందిన చివటం వాస్తవ్యులు నీలం ప్రసాద్, నీలం గోపాల్ సోదరులు రూ.5500 మరికొంత మంది కలిసి మొత్తం రూ.7500 నగదు సాయం అందజేశారు.

టెర్రస్ గార్డెనింగ్‌తో ఎన్నో ఉపయోగాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగర వాతావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు టెర్రస్ గార్డెనింగ్ ఎంతగానో దోహదపడుతుందని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ భవనంపైన అధికారులతో కలిసి మంగళవారం ఆయన మొక్కలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఇటీవల కాలంలో టెర్రస్ గార్డెనింగ్ పెరిగిందన్నారు. అధిక శాతం మంది ప్రజలు భవనాలపై తమ సొంత కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను సేంద్రీయ పద్ధతుల్లో సహజసిద్ధంగా పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, ఇఇ మాధవి, ఎడిహెచ్ కె.స్వాతి పాల్గొన్నారు.

పిహెచ్‌డికి ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల అర్హత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో గణిత శాస్త్ర విభాగంలో ఎంఎస్‌సి మ్యాథమెటిక్స్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బూలా వెంకట రాజు, దూనబోయిన సాద్వీక, పేరాల శేఖర్ విఐటి విశ్వవిద్యాలయం, అమరావతిలో పిహెచ్‌డి ఫుల్ టైం చేయడానికి అర్హతను సాధించారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి ఆ తర్వాత ఇంటర్వ్యూలో ప్రతిభ చూపించి విజయం సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కె విద్యార్థులను అభినందించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పతకాలను బహుకరించి విద్యార్థులను సత్కరించారు. ఉపకార వేతనంతో కూడిన ఫుల్ టైం పిహెచ్‌డి చేయడానికి అర్హత పొందడం స్ఫూర్తిదాయకమని గణిత శాస్త్ర విభాగాధిపతి జి.చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. ఫెలోషిప్ నెలకి రూ.35 వేలు, ఒక్కో పేపర్ పబ్లికేషన్స్‌కి రూ.35 వేలు ఆర్థిక సాయం, రూ.10 వేలు సెమినార్స్, వర్క్‌షాప్‌కి ఎంపిక ఐన విద్యార్థులకు విఐటి, యూనివర్సిటీ, అమరావతి నుంచి అందజేయడం జరుగుతుందని తెలిపారు. విఐటి విశ్వవిద్యాలయానికి పిహెచ్‌డి కొరకు ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రప్రథమంగా ప్రవేశం సాధించిన విద్యార్థులు వీరే అవ్వడం గొప్ప విషయమని కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డివిఎన్ఎస్.మూర్తి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. గణిత శాస్త్ర విభాగ అధ్యాపకులు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

దాతల సహకారంతో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రులో మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన అకిరా కంటి ఆసుపత్రి సౌజన్యంతో దాతలు కుందుల గణపతిరావు కుందుల భూపతిరావు సహకారంతో నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 135 మందికి రోగులకు వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి దాతల సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలియజేశారు.

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా రేషన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

లబ్ధిదారులకు ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ మండల రేషన్ షాప్ డీలర్లకు సూచించారు. మంగళవారం, తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, జూన్ మొదటి తేదీ నుంచి షాపుల వద్ద రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభిస్తున్న సందర్భంగా డీలర్లకు పలు సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సరుకులు అందించే దుకాణం పరిశుభ్రంగా ఉంచాలని, తూనికలు, కొలతల కోసం ఉపయోగించే పరికరాలు సీల్ వేసి ఉండాలన్నారు. మొదటి తేదీ నుండి 16వ తేదీ వరకు తప్పనిసరిగా, సమయపాలన పాటిస్తూ, ఆయా డీలర్లు మాత్రమే సరుకులు అందించాలని తెలిపారు. అధికారులు, ప్రజా పాలకులు, నాయకులు ఎవరైనా ఏ సమయంలోనైనా తనిఖీకి రావచ్చని కాబట్టి తప్పనిసరిగా సూచనలు పాటించి, దుకాణాలు నడిపించాలన్నారు.

బాలికకు అండాశయ కేన్సర్ చికిత్స

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ఇటీవల 12 ఏళ్ల బాలికకు అరుదైన పెద్ద అండాశయ కణితిని విజయవంతంగా తొలగించి, ఆమెకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. తీవ్రమైన కడుపు వాపు మరియు అసౌకర్యంతో ఆసుపత్రికి వచ్చిన ఆ బాలికకు దాదాపు 32 వారాల గర్భధారణ పరిమాణంలో దాదాపు 20 సెం.మీ. పరిమాణంలో ఉన్న ఒక భారీ కణితిని వైద్యులు గుర్తించారు. డైస్జెర్మినోమా విస్తృతమైన మూల్యాంకనం తర్వాత, ఆ బాలికకు డైస్జెర్మినోమా అనే అరుదైన అండాశయ కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇది సాధారణంగా యువతులలో కనిపించే ఒక రకమైన కేన్సర్. ఈ నిర్ధారణ ఆ బాలిక కుటుంబానికి తీవ్ర ఆందోళన కలిగించినప్పటికీ, మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం వెంటనే చర్యలు చేపట్టింది.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో బాలుని మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇంట్లో ఆడుకుంటుండగా పాముకాటుకు గురై బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన జనిపి రెడ్డి శ్రీరాములు, నాగలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర గుడి సమీపంలో ఉంటున్నారు. శ్రీరాములు కూలి పని చేసుకుంటూ భార్యాబిడ్డలను పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కుమారుడు మోహన్ నాగ సూర్య(5) మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎప్పటిలాగే మంచం కిందకు వెళ్లి ఆడుకుంటున్నాడు. కాసేపటికి కుమారుని చూసే సమయానికి స్పృహతప్పి అపస్మారక స్థితిలో ఉన్నాడు. బాలుడు శరీరంపై పాము కాటు వేసినట్లుగా గాయం ఉండడంతో తల్లిదండ్రులు హుటాహుటిన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై డ్రంకె అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము మంగళవారం తెలిపారు. వివరాలు ఇవి.. సాధారణ వాహనాల తనిఖీలు భాగంగా వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీతింగ్ ఎనలైజర్ మిషన్ ద్వారా టెస్టింగ్ చేశారు. వారు పరిమితకు మించి అధికంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యు.కొత్తపల్లిలో...

ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న పోలీసులకు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న ఇరువురిని గుర్తించి వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఇద్దరిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలకు రికార్డులు లేనట్లు గుర్తించినట్లు వివరించారు. అలాగే నేమం వద్ద తిమ్మాపురం పోలీసులు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3010 లు స్వాధీనం చేసుకున్నట్లు కోరంగి ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పిల్లలకు చిత్రహింసలు : తల్లిదండ్రులకు జైలు

ప్రజాశక్తి - కడియం

కన్న పిల్లలను చిత్రహింసలు పెట్టిన తల్లిదండ్రులకు న్యాయమూర్తి శిక్ష విధించిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియం గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఖండవల్లి దాసు, ఖండవిల్లి కృపావతి తమ కన్న పిల్లలను శారీరకంగా చిత్రహింసలు పెట్టడంతో చైల్డ్ లైన్ టీము సభ్యుని ఫిర్యాదు మేరకు కొన్నేళ్ల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం రాజమహేంద్రవరం ఏడో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.బాబు దాసు, కృపావతి దంపతులకు మూడేళ్ల జైలు శిక్ష విధించినట్టు కడియం పోలీసులు తెలిపారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

దేశభక్తి గీతాలపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం దేశభక్తి గీతాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో తెలుగు ఉపాధ్యాయుడు తాటిగడప సుబ్బారావు విద్యార్థులకు దేశభక్తి గీతాలు, శతక పద్యాలపై శిక్షణ ఇచ్చారు.

వైభవంగా జట్లమ్మ జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి గ్రామంలోని జట్లమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతర కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరాలశెట్టి బాబ్జీరావు, కొప్పిరెడ్డి నాగబాబు, ఎర్రా సత్తిబాబు, వల్లభశెట్టి రాంబాబు, పోలమరశెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గున్ని, కటారి శ్రీను, చెరువు గోపు వల్లయ్య, కంటిబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మదుగులమ్మ జాతర

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురంలో మదుగులమ్మ జాతర సోమవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో గరగ నృత్యాలు, విచిత్ర వేశధారణలు, బాణాసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమావాస్య కావడంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక సిఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ టిడిపి నాయకులు చల్లా బుజ్జి మాట్లాడుతూ జాతర ముగింపు సందర్భంగా జూన్ 1వ తేదీన అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

లింగంపర్తిలో అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తి గ్రామంలో ఆంజనేయ జయంతిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఊర కృష్ణ, చిక్కాల లక్ష్మణరావు, వడ్డీ నాగదుర్గ, చదర మురళీ, ఊటుకూరు నానాజీ, ఆళ్ల దుర్గారమేష్, పెంటకోట రమేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం

- సాంకేతిక సమస్యలతో తికమక
- గెజిటెడ్ హెచ్‌ఎంల ఉద్యోగోన్నతుల్లో నష్టం
- జిఒ, ఒప్పందాలకు విరుద్ధంగా ప్రక్రియ
- ఆందోళనలో ఉపాధ్యాయులు



యుటిఎఫ్ హోంలో హెల్ప్‌డెస్క్‌లో నిమగ్నమైన నేతలు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తులసి రాంబాబు అనే ఉపాధ్యాయుడు సామర్లకోట ఎస్‌బిజికె పాఠశాలలో 2009 నుంచి పని చేస్తున్నారు. అయినా సరే నేటికీ ఎనిమిదేళ్లు పూర్తికానట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది. ఆర్.లలిత అనే ఉపాధ్యాయిని 2014లో ఎస్ఎంవిఎస్ ఎడిట్ స్కూల్లో చేరారు. అప్పటి నుంచి సర్వీస్ పాయింట్ లెక్కించవలసిందిగా కోరుతున్నారు. ఈమె డిఇఒ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా అనేక మంది టీచర్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

ఇలా టీచర్ల బదిలీలు గందరగోళం నడుమ సాగుతున్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. సర్వీసు పరమైన వివరాలు సవ్యంగా నమోదు కాక తీవ్రంగా నష్టపోతున్నామని ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. దరఖాస్తు సమయంలో వెబ్‌సైట్‌లో చూపిస్తున్న వివరాలకు భిన్నంగా ఫైనల్ జాబితాలో చూపిస్తుండటంతో ఎక్కడికి బదిలీ అయిపోతామనే ఆందోళన వారిలో కనిపిస్తుంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ చివరి దశకు చేరుకొంది.

పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జెడ్‌పి, మున్సిపాలిటీ, నగర పాలక సంస్థల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, సెకెండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల ప్రక్రియ ఈనెల 21 నుంచి ప్రారంభమైంది. ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు పూర్తి చేసిన స్కూల్ అసిస్టెంట్స్, సెకెండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీలు తప్పనిసరి అని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతోంది. దరఖాస్తులను ఈ నెల 21 నుంచి 22 వరకూ హెచ్‌ఎం లకు, 24 వరకు స్కూల్ అసిస్టెంట్‌లకు, 27 వరకు ఎస్‌జిటిలకు స్వీకరించారు. ఈ మూడు కేటగిరీలకు ఈ నెల 28 వరకూ వెరిఫికేషన్ జరుపనున్నారు. ప్రొవిజనల్ సీని యారిటీ జాబితా ఈ నెల 31 కల్లా విడుదల చేస్తారు. అభ్యంతరాలకు వచ్చే నెల 2 వరకూ అవకాశం ఇచ్చారు. ఫైనల్ సీని యారిటీ జాబితా వచ్చేనెల 6న విడుదల చేస్తారు. వెబ్ ఆప్షన్లు 7వ తేదీ నుంచి 10 వరకు అవకాశం కల్పించారు. బదిలీల ఉత్తర్వులను హెచ్‌ఎం లకు ఈనెల 30న, స్కూల్ అసిస్టెంట్స్‌కు జూన్ 4న, ఎస్‌జిటి లకు 11న ఇస్తారు. పదోన్నతులను 30 నుంచి వచ్చేనెల 5తేదీ లోపు ఇస్తారు. ప్రమోషన్ల ఉత్తర్వులను స్కూల్ అసిస్టెంట్లకు 31న, ఎస్జిటీలకు 6న ఇస్తారు.

ఈ ప్రక్రియలో ఉన్న లోపాల వల్ల గెజిటెడ్ హెచ్‌ఎంల ఉద్యోగోన్నతుల్లో మెరిట్ కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి టీచర్లకు అన్యాయం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. గెజిటెడ్ హెచ్‌ఎంల ఉద్యోగోన్నతి పదోన్నతి సీనియార్టీ లిస్టులో 2021లో ఇచ్చిన మెమో 14021/బి2/ 2021, సిఎస్ఇ 21.12.2021ను ఫాలో అవకుండా రోస్టర్ కం మెరిట్ ఫాలో అవ్వడం వల్ల మెరిట్ కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి టీచర్లు నష్టపోతున్నారు. దీనిని సరిచేసి ప్రమోషన్స్‌లో ఎస్‌సి, ఎస్‌టి రోస్టర్ ప్రకారంగా పోస్టులు కేటాయించి మిగిలిన వాటికి మెరిట్ ప్రకారంగా ప్రమోషన్స్ ఇవ్వాల్సింది ఉంది.

అస్తవ్యస్తంగా బదిలీలు

ఈ బదిలీల వ్యవహారం మొత్తం అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులను, అధికారులను గందరగోళపరిచే విధంగా కనిపిస్తుందని టీచర్లు బహిరంగానే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుకొక వివాదాస్పద కొత్త సమస్యను సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒకు అనుగుణంగా, ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన ఒప్పందం ప్రకారం కాకుండా ఈ వ్యవహారం జరిగిపోతుందంటూ చెబుతున్నారు. సంబంధం లేని అంశాలతో రోజుకొక సమాధానం ఇస్తున్నారు. షెడ్యూల్‌లో ప్రతి స్థాయిలోనూ తక్కువ సమయం కేటాయించడం వల్ల ఇటు ఉపాధ్యాయులు అటు అధికారులు తీవ్ర ఒత్తిడి, గందరగోళానికి గురవుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అంతర్భాగమైన యానాం కేంద్ర పాలిత ప్రాంతంలో పని చేసే ఉపాధ్యాయుల స్పౌజ్‌లకు స్పెషల్ పాయింట్స్ గత బదిలీల నుంచి ఎల్లప్పుడూ ఇచ్చేవారు. ఈసారి ఇవ్వడానికి అభ్యంతరం ఉంది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన విధంగా ఈ బదిలీలు చేపట్టాలని టీచర్లు కోరుతున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు

ఎయిడెడ్ పాఠశాలల్లో సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వులు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులకు వారి మొత్తం సర్వీసును బదిలీల పాయింట్లకు కలుపకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఇలా చాలా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కొంతమందికి 8 సంవత్సరాలు పూర్తవ్వకపోయినా ఎనిమిదేళ్లు పూర్తయినట్లుగా భావించి తప్పనిసరి బదిలీ చేయవలసిందిగా ఒత్తిడి చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ సరైన టెస్టింగ్ జరగకుండా రూపొందించడం వల్ల అనేక సాంకేతిక సమస్యల తలెత్తుతున్నాయని టీచర్లు అనేకసార్లు అధికారులు దృష్టిలో పెట్టినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ ప్రివ్యూలో ఒకవిధంగా, ప్రింట్‌లో ఇంకొరకంగా, డిస్‌ప్లేలో మరోరకంగా చూపుతుంది. ఈ నేపథ్యంలో వెంటనే అధికారులు స్పందించి సాఫ్ట్‌వేర్‌లో లోపాలను సారిదిద్దాలి.

ఒప్పందం ప్రకారం జరగాలి

ఉపాధ్యాయ సంఘాలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై అధికారులకు తగు సూచనలు ఇచ్చి ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా షెడ్యూల్‌ను పొడిగించి సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి. గందరగోళం పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

టి.చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఐపిఎల్ ఫ్యాన్ పార్క్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో ఐపిఎల్ ఫ్యాన్ పార్క్‌కు అవసరమైన అన్ని అనుమతులు, ఇతర ఏర్పాట్ల పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఐపిఎల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు, హాకీ స్టేడియం అభివృద్ధి పనులపై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఆర్ అండ్ బి అధికారులు, కన్సల్టెంట్ ఏజెన్సీ ప్రతినిధులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపిఎల్ క్రికెట్ సందడిని అభిమానులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో బిసిసిఐ ఐపిఎల్ ఫ్యాన్ పార్కులను దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఏర్పాటు చేస్తుందన్నారు. ఎపి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ, రాజ్యసభ ఎంపి సానా సతీష్‌బాబు ప్రతిపాదన మేరకు బిసిసిఐ కాకినాడ డిఎస్ఎ మైదానంలో జూన్ 1న జరిగే ఐపిఎల్ సెమీఫైనల్, 3వ తేదీన జరిగే ఫైనల్ మ్యాచ్‌లను ఉచితంగా తిలకించేందుకు ఐపిఎల్ ఫ్యాన్ పార్క్‌ను సిద్ధం చేయాలన్నారు. మొట్టమొదటి సారిగా నగరంలో ఈ ఫ్యాన్ పార్కు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఐపిఎల్ ఫ్యాన్ పార్క్‌కు అవసరమైన అన్ని అనుమతులు ఇతర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం, మ్యూజిక్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్ కోర్టులు, కిడ్స్ ప్లే జోన్, ఫోటో బూత్స్, డగౌట్లు, ఫేస్ పెయింటింగ్ స్టేషన్లతో అచ్చం మైదానంలో ఎలాంటి వాతావరణం ఉంటుందో అలాంటి వాతావరణాన్నే ఫ్యాన్ పార్కులలో సృష్టించనున్నారని ఆయన తెలిపారు. ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. డిఎస్‌సి మైదానంలో ఉన్న హాకీ స్టేడియం లైట్లు, గ్యాలరీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసురావు, బిసిసిఐ ప్రతినిధి యోగేశ్వరరావు, ఆర్ అండ్ బి డిఇ శ్రీనివాస్, ఇంజనీర్లు బి.శ్రీనివాసరావు, డి.మహాలక్ష్మి, పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న తుమ్మలపల్లి రమేష్

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ సాయంతో పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉలిసే ఐరాజ్, మాదారపు వీరబాబు, సత్తి సోమరాజు, కురుమళ్ళ నాగేశ్వరావు, అరినే రాజేష్, గంధం శ్రీను, కనకరాజు, కొలమూరి బుజ్జి, కొలమూరు భద్ర, వంశీ, పద్మరాజు పాల్గొన్నారు.

కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

కాకినాడలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంకు జన విజ్ఞాన వేదిక ఘనంగా నివాళులర్పించింది. మంగళవారం స్థానిక బోట్ క్లబ్ వద్ద ఉన్న కందుకూరి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం జరిగింది. జెవివి ప్రధాన కార్యదర్శి వర్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్‌వర్మ, జెవివి రాష్ట్ర కార్యదర్శి కెఎంఎం ఆర్.ప్రసాద్, దళిత ఉద్యమ నేత ఐతాబత్తుల రామేశ్వరరావు, పెన్షనర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, జెవివి కార్యదర్శి యుఎస్ఎన్.రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికావిద్య, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా వితంతు వివాహాలకు వీరేశలింగం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెవివి నగర శాఖ అధ్యక్షులు ఆలపాటి శ్రీనివాస్, జెవివి కార్యదర్శులు ఎన్‌వి.పద్మావతి, బివివి.సత్యనారాయణ, ఎం.రామకృష్ణ, సిఐటియు నాయకులు మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, పలివెల వీరబాబు, జెవివి నాయకులు చింతపల్లి సుబ్బారావు, డాక్టర్ వేదుల శిరీష్, పి.మధుకుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు. పెద్దాపురంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో కందుకూరి వర్ధంతిని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ మాట్లాడారు. సభ ప్రారంభానికి ముందు కందుకూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సభలో పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, ప్రజానాట్యమండలి నాయకులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, అంజలి, అనూష, చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులు జశ్విత, అమృత, నమ్రత, బంగారం పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో యోగాపై శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని యోగాతో జరిగే ఉపయోగాలను వివరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

యు.కొత్తపల్లి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రవికుమార్, తహశీల్దార్ జి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ, మండల ప్రజా పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక కాపు కల్యాణ మండపంలో ప్రభుత్వ ఉద్యోగులకు యోగపై శిక్షణ ఇచ్చారు. యోగ గురువులు తోట చంద్రమోహన్, పాబోలు సీతారామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఇఒపిఆర్‌డి సూర్య భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పాల్గొని మాట్లాడారు. అలాగే ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆధ్వర్యంలో యోగాపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఒ సత్యనారాయణ, కమిషనర్ కెవి.సత్యనారాయణ, వైస్ ఎంపిపి చిక్కాల రాజేశ్వరి, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో యోగాపై శిక్షణా కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి త్సలికి దొరబాబు, మండల పరిషత్ కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, ఆయుష్ శాఖ హోమియో వైద్యురాలు డాక్టర్ పి.మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి శిక్షకులు బి.ఈశ్వరరావు, యు.భార్గవ్ శిక్షణ ఇచ్చారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.అనుపమ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు, ఎఒ బిఎల్.నరసింహం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ ట్రైనర్స్‌చే వివిధ రకాల యోగాసనాలను చేయించి సిబ్బందికి, ప్రజలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల విభాగం జాయింట్ సెక్రటరీగా బండారు



ప్రజాశక్తి - కిర్లంపూడి

వైసిపి రాష్ట్ర వికలాంగుల విభాగం జాయింట్ సెక్రటరీగా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బండారు ప్రసాద్‌ను నియమించారు. రామచంద్రాపురం ఎంపిటిసిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మాజీ ఎంపి తోట నరసింహం సిఫార్స్‌తో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో తనను నియమించారని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైసిపి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. బండారు ప్రసాద్‌ను పార్టీ నాయకులు అభినందించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతంలో అధిక శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలు, దిగువ మధ్య తరగతికి చెందిన కుటుంబాలవారు ఉంటారని, వారి జీవన ప్రమాణాలు పెరగాలన్నా మంచి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం పొందాలంటే ఆయా కళాశాలల ప్లేసెమెంట్, ల్యాబ్, లైబ్రరీ, ఫాకల్టీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్య నాలుగు తరాల కుటుంబ స్థితిగతులను ప్రభావితం చేస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ అవగాహన సదస్సు డీన్ అడ్మిషన్స్ డాక్టర్ ఎ.రామకృష్ణ, అసోసియేట్ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్.గిరిప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో టెక్నికల్ హబ్ సిబ్బంది కిరణ్ ఆదిత్య యూనివర్సిటీలో అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సులపై అవగాహన కల్పించారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకెలో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెఎన్‌టియుకెలో కాంట్రాక్ట్ లెక్చరర్లు చేపట్టిన ఆందోళనకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి 133 మంది కాంట్రాక్ట్ లెక్చరర్స్ పని చేస్తున్నారన్నారు. వీరిని కొత్తగా ఇంటర్వ్యూలు జరిపి మళ్లీ విధులకు తీసుకుంటామని చెప్పడం దారుణమన్నారు. గతం నుంచి పని చేస్తున్న వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ మస్తాన్, డాక్టర్ నాగార్జున, సుధాకర్ శ్రీనివాస్, రఘురాం, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

సాథీ ద్వారా ఆధార్ నమోదు

ప్రజాశక్తి - జగ్గంపేట

నిరాశ్రయులుగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించడమే సాథి పథకం లక్ష్యమని సిడిపిఒ ఎం.పూర్ణిమ అన్నారు. మంగళవారం సుప్రీం కోర్టు ఆదేశాలతో సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సెస్‌టు ట్రాకింగ్ హోలిస్టిక్ ఇంక్లూషన్ (సాథి) కార్యక్రమాన్ని జగ్గంపేటలో నిర్వహించారు. పెద్దాపురం కోర్టు మండల న్యాయసేవాధికారి కమిటీ ఛైర్మన్, 7వ జిల్లా కోర్టు జడ్జి జి.చంద్రమౌళేశ్వరి, న్యాయవాదులు, పారాలీగల్ బృందంతో స్థానిక సంత మార్కెట్ వద్ద నిరాశ్రయులుగా ఉన్న 18 సంవత్సరాల లోపు వారిని గుర్తించారు. వారికి ఆధార్ కార్డులను నమోదు చేయించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ సాథీ కార్యక్రమం ద్వారా వారికి గుర్తింపు ఇచ్చి ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘునాథరావు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్ ఎస్ఎ.గఫూర్ పాల్గొన్నారు.

ఎంకెఆర్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజును పురస్కరించుకుని ఎంకెఆర్ ప్రీమియర్ లీగ్ వెయిట్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ప్రారంభం అయింది. మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక మెట్టకూరు హైస్కూల్ గ్రౌండ్లో ప్రారంభం అయిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.30వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. మల్లాడి కృష్ణారావు పుట్టిన రోజైన వచ్చే నెల 6వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాడి అభిమాన సంఘ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ సూర్యప్రకాష్, ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి శామ్యూల్, గుత్తుల గోవింద జయరామారావు, రిటైర్డ్ సిఐ శివగణేష్, స్థానికులు గణేష్, పంతగడ రమేష్‌నాయుడు, దుర్గబాబు, సుమన్, మల్లవరపు దయ, కాలాడి నాగూర్, చింతం అజయ్ పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు.

నెహ్రూ, బాపనయ్యకు నివాళులు

ప్రజాశక్తి - యానాం

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి, అలాగే బెజవాడ పెదబాపనయ్య నాయుడు జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్ మార్గంలో ఉన్న వారి విగ్రహాలకు ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, సిఐ అదలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాపనయ్య నాయుడు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - యానాం

ఐటిఐలో వివిధ ట్రేడుల్లో సాంకేతిక శిక్షణ పొందిన అభ్యర్థులకు బుధవారం యానాం ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. తమిళనాడు కాంచీపురంలోని ఎల్ అండ్ టి కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్మెన్ సివిల్, వెల్డర్, మెకానిక్ మోటార్ ట్రేడుల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు యానాంలో ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. యానాం రీజియన్ కు చెందిన ఐటిఐ ఆఖరి సంవత్సర విద్యార్థులు, శిక్షణ పూర్తిచేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849010936 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.